# పాడవేల రాధికా !

పూల మొక్కల మధ్య రకరకాలుగా వెలుగు నీడలతో దోబూచులాడుతున్న శీతాకాలపు చల్లని ఎండలో సప్తస్వరాలు పలికిస్తున్న వీణలా భాసిస్తోంది నీరజా బి.ఏ.

ఆ అందం చూసేవాళ్లకి.

కాని నీరజ మనస్సులో మాత్రం ఆమె చుట్టూ విరబూసివున్న కనకాంబరం పువ్వులు కాషాయరంగుని గుర్తు చేస్తున్నాయి.

నిజానికి నీరజ మధురోహలతో హిందోళ రాగంలా తేలిపోవాల్సిన సాయంసమయమిది. పెళ్లివారొచ్చారు. నీరజని చూసి ఎంచుకోడానికి. నీరజను చూడగానే నిన్న రైల్లో నిద్రలేక్కాబోలు బద్ధకంగా మత్తుగా వున్న కథానాయకుని కళ్లు తళుక్కున మెరిశాయి. పెద్దలక్కావాల్సిన చట్టవిరుద్ధమైన అంశాల్లో ఎలానూ పెద్దపేచీలేదు. (నీరజ తండ్రీ, అన్నలు అందరూ రెండుచేతులా సంపాదిస్తున్నారు. ఆమె అక్కలకి ఎప్పుడో పెళ్ళిళ్ళయిపోయాయి. ఈమే ఆఖరి ఆడబడుచు ఆ యింటికి. ఈ విషయాలన్నీ మధ్యవర్తులు ప్రచారం చేస్తూనే వున్నారు.)

అయితేనేం. పెళ్ళిచూపులు క్రైసిస్‌లో చిక్కుకున్నాయి.

ఒకర్నొకరు పరిచయం చేసుకోడాలు, అల్పాహార సేవనం, నీరజచేత సుమతీ శతకం, ఇంగ్లీషు పేపరు చదివించడం, ఛలోక్తులు - అలా సరదాగా ఆశావహంగా జరిగిన పెళ్ళిచూపుల రాగంలో ఓ అపస్వరం పలికింది. అదీ సంగీతం గురించి!

"అమ్మాయికి సంగీతం చెప్పించారా?"

"బాగా నేర్చుకుందండి. శ్రీమతి సునందాశాస్త్రి దీని గురువుగారు. 'సామజవరగమనా' పాడతావాతల్లీ?" మురిపెంగా నీరజను ప్రోత్సహించాడు తండ్రి.

"అంటే శాస్త్రీయ సంగీతమే! నాకు చాలా ఇష్టం" అంది అబ్బాయి తల్లి.

నీరజకి ఆనందంతో ఒళ్ళు పులకరించింది. కళాతపస్వి కె. విశ్వనాథ్ దర్శకత్వంలో "శంకరాభరణం" అనే సినీమావచ్చాకా శాస్త్రీయ సంగీతానికి ఆంధ్రదేశంలో ఓ అరుదైన గుర్తింపు లభించింది. అంతదాకా కేవలం 'గొప్ప' వాళ్ళకోసమే కాబోలు శాస్త్రీయసంగీతం అనుకునే జనం శంకరాభరణం పాటల్ని విని పరవశించారు. ఆ ఊపులోనే నీరజ తండ్రి ఓ వీణ

కొనేసి ఆమెకు శాస్త్రీయ సంగీతం నేర్పించడం జరిగింది.

కాని శంకరాభరణం సినిమాలో 'సామజవరగమనా' పాట (ఎస్. జానకి గారు ఎంతో గొప్పగా పాడినా) కథకోసం ఓ అపస్వరాన్ని తెచ్చుకుని పెళ్ళిచూపుల్ని హఠాత్తుగా ఆపేస్తుంది. ఇక్కడా అలాగే జరిగింది.

నీరజ ఇంకా పాట మొదలెట్టకుండానే కుర్రవానితల్లి తల ఆడిస్తూ కుర్చీమీద తాళం వేయడం మొదలెట్టి నీరజ 'సామజ...' అనగానే 'అమ్మబాబోయ్' అని కుర్చీలో వాలిపోయింది. ఆవిడకి సెర్వికల్ స్పాండిలోసిస్. రావడమే శాస్త్రీయ సంగీతం ఎక్కువ వినడంవల్ల వచ్చింది. దాంతో డాక్టర్లు, ఇంజక్షన్లు, ఆవిడ మెడకి సపోర్టుగా బెల్టు వచ్చాయి. ఆవిడ పేరు కీరవాణి.

కీరవాణిగారికి చిన్నప్పుడు క్లాసికల్ మ్యూజిక్ అంటే అయిష్టం. ఎలర్జీ. కాని ఆవిడ భర్త పెద్ద ఉద్యోగస్తుడవడం, జీతానికి మించిన ఆదాయం సంక్రమించడం వగైరా ఉదాత్త, అనుదాత్త దశలు పట్టడంతో విధిగా ప్రతి గానకచ్చేరీకీ వెళ్ళాల్సిన అవస్థ ఏర్పడింది. వెళ్ళడం ప్రభుత్వఖర్చుతో ప్రభుత్వ డ్రైవర్ నడిపే ప్రభుత్వ కారులోనే అయినా ఆవిడకీ శాస్త్రీయ సంగీతానికీ ఆ కర్ణాంత విశాల వైరం కనుక శిరోవేదన తప్పేదికాదు.

కాని 'స్టేటస్ సింబల్'గా గానసభలు అతుక్కుపోయాయి ఆమెకూ భర్తకూ.

అంచేత కీరవాణిగారు గానసభల్లో పాల్గొంటూనే వినకుండా ఉండే పద్ధతి కనిపెట్టారు. అదేమిటంటే గానసభలో మిగతా జనాన్ని చూస్తూ, సాటి ఆడవాళ్ళ నగల, చీరల వెలలూ తాను కొనే అవకాశాలూ అంచనావేస్తూ, శ్రోతల్లో ఎవరు బాగా పాటకి లయగా తల ఆడిస్తున్నారో చూస్తూ వాళ్ళని అనుకరించడం!

అలావచ్చింది, ఆవిడకు మెడనొప్పి. ఇప్పుడు పెళ్ళిచూపులకి వెళ్తూ మెడబెల్ట్ పెట్టుకుంటే ఆవిడ మెడలోని లక్షన్నర చేసే నగల గతి ఏమిటి? అంచేత బెల్ట్ లేకుండానే నీరజగారింటికి వచ్చింది కీరవాణిగారు.

అప్పుడప్పుడు మెడబెల్ట్ లేకపోయినా పర్వాలేదని డాక్టర్లు చెప్పారు. అలాగని ఏదైనా పాట వింటూ, ఎంత నచ్చినా తల ఆడిస్తే డేంజరని కూడా హితవు చెప్పారు.

కాని ఎంతో శ్రమపడి అలవర్చుకున్న తలవాటం - అదే అదే - అలవాటు ఒక్కసారి పోతుందా!

అంచేత నీరజ 'సామజ వరగమనా' అనే త్యాగరాజకృతి పాడ్డం మొదలెట్టగానే కీరవాణి గారు తల తిప్పడం మొదలుపెట్టడం వెంటనే మెడ దారుణంగా నొప్పిపెట్టి కుర్చీలో వాలి పోవడం శరవేగంతో జరిగిపోయాయి. అది పెద్ద 'అపశకునం'గా కీరవాణిగారి 'పార్టీ' భావించారు. పైకి అనేశారు కూడాను.

అంతలో ప్రభుత్వంవారి దయవల్ల రోజూ విధిగా లభించే కరెంట్ ఫెయిల్యూర్ మొదలై, గదిలో ఫాన్లు, దీపాలు ఆరిపోయాయి. "అబ్బబ్బా పాడు ఉక్క.. అలా గాలిలోకి పోదాం" అంటూ కీరవాణిగారు మూలుగుతూనే సూచన ఇవ్వడంతో మొగపెళ్ళివారంతా ఏకతాటి మీద నడిచి డాబా ఎక్కారు.

నీరజ షాక్ ఐపోయింది.

అందులోనూ సంగీతం ఆమెకు ఆరో ప్రాణం.

పాట అందుకోగానే ఈ అపశ్రుతి.

ఆమె మనస్సు కీడుశంకించింది. కారణం ఇదివరలో ఆమె హాజరైన ఎన్నో పెళ్ళి ఇంటర్వ్యూల్లో నిష్కారణంగా ఫెయిలవ్వడమే.

నీరజ చిన్నన్న చంద్రం వెంటనే రంగంలోకి దిగాడు. నవ్వు నటిస్తూ "ఇంటర్వెల్! పాప్‌కార్న్... పాప్‌కార్న్.... పాప్‌కార్న్... లిమ్కా లిమ్కా లిమ్కా.... హాల్లో సిగరెట్లు కాల్చరాదు. ఎదర కుర్చీపై కాళ్ళు పెట్టరాదు....మారాబోవు చిత్రాలు... గాంధారి గర్వభంగం.....మాయాబజారు....కోడలు దిద్దిన అ .... ఆ... ఆః..." అని హుషారుగా ఇది ముగింపు కాదనీ, కథ సుఖాంతమేననీ చెల్లెలుకు స్ఫురించేలా నానా అల్లరీ చేసి; ఆమెను ఆ ఇంటిచుట్టూవున్న పూలమొక్కల్లోకి నడిపించి 'అబ్బాయి ఎలా ఉన్నాడే?' అన్నాడు.

ఎలా ఉంటేనేం...ఈ సంబంధం నా ఆఖరిసంబంధం. కుదిరినా కుదరక పోయినా సరే. చచ్చినా ఈ అవమానాలకు సిద్ధపడను నేను. త్యాగరాజు కృతి విని తలనొప్పి. మెడపోటు తెచ్చుకునేవాళ్ళు అది తమ కర్మ అనుకోక నన్ను హేళన చేయడం దేనికి?" అంది నీరజ ఏడుపు ఆపుకుంటూ.

"నిన్నేమన్నారే?"

"విను నీకే తెలుస్తుంది."

"బాధకొద్దీ ఆవిడ విసుక్కుందేమో. సెర్వికల్ స్పాండిలోస్ చాలా హైక్లాస్ జబ్బు తెలుసా? సంగీతాల్లో కర్నాటక సంగీతం ఎలాగో, మెడనెప్పుల్లో ఇది అంత గొప్పది. అంచేత దాని విసుర్లు దానికుంటాయి. ఇంతకీ నీకు అబ్బాయి నచ్చాడా లేదా?"

"నచ్చాడు."

"ఎందుకు నచ్చడు. చాలా వినయం వందనం ఉన్నవాడని తెలుస్తూనే వుంది. సతీవ్రతా లక్షణాలు పదహారు ఉన్నాయి. అంచేత నువ్వు, నిరుత్సాహపడాల్సిందేంలేదు. ఏదీ నవ్వు" అని మెడలో కితకితలు పెట్టి నీరజను నవ్వించి డాబామీదున్న పెళ్ళివారివైపు పరిగెత్తాడు చంద్రం.

అలా దుఃఖాన్ని దిగులుగా దిగజార్చిన నీరజ మూగవీణలా బంతిమొక్కల పక్కన ముద్దబంతిపువ్వులా కూర్చుని కూనిరాగాలు తీయసాగింది.

అదే సమయంలో తమ ఇంట్లోనే అద్దెకుంటున్న పంచాంగాల సిద్ధాంతిగారు రాబోయే సంవత్సరపు పంచాంగం లెక్కలు చేస్తూ కూనిరాగం తీస్తూండడం ఆమె చెవిన పడింది.

తన దిగులు మర్చిపోడానికని కాబోలు ఆయన కూనిరాగాలు శ్రద్ధగా వినసాగింది నీరజ.

ఫక్కున నవ్వింది నీరజ!

ఎందుకంటే సిద్ధాంతిగారు రోజూ మూడు సంధ్యలా సహస్ర గాయత్రి జపించేవాడు. రేడియో, టీ.వి.ల్లో రోజూ వినపడే ఓ బట్టల సబ్బు గురించిన పాట హమ్ చేస్తున్నాడు ! పంచాంగంరాస్తూ !

విరగపడి నవ్వింది నీరజ. యుగ యుగాలుగా మూఢనమ్మకాల మట్టిదిబ్బల్లో కూరుకుపోయిన స్త్రీలు సరోజినీనాయుడు, ఇందిరాగాంధీ ప్రభృత వీరమహిళల ఆదర్శాల్ని స్వీకరించి వెలుగులోకి వస్తుంటే వాళ్ళని కప్పివుంచిన మట్టిదిబ్బలు విరిగిపడినట్లుగా ఆమెలో గత కొద్ది గంటలుగా అణగిపడివున్న సహజప్రతిభ, యుక్తి, హాస్యప్రియత్వం బయటపడ్డాయి.

అదేక్షణంలో ఎలక్ట్రిక్ కరెంట్ వచ్చేసింది. ఆరిన దీపాల ముఖాలు వెలిగాయి. బిక్కుబిక్కుమంటున్న ఫాన్లు గిర్రున తిరిగాయి. డాబామీంచి దిగివచ్చారు పెళ్ళివారు.

మళ్ళీ మొదలయ్యాయి పెళ్ళిచూపులు. కీరవాణిగార్ని ట్రీట్ చేయ్యడానికి వచ్చిన డాక్టరు "మళ్ళీ రెండు రోజుల్దాకా క్లాసికల్ మ్యూజిక్ వినకండి" అని వెళ్ళిపోయాడు.

సిగ్గుతో కీరవాణిగారి మొహం ఎర్రగా కందిపోయింది. "నాకేం భయంలేదు. ఎన్ని పాటలేనా వినగలను. వారానికి మూడు గానకచేరీలకి వెళ్ళేదాన్ని. నా కల్చర్ మూడు జన్మలెత్తినా రాదు ఈ డాక్టర్లకి. హా ...." అని ముక్కుపుటాలెగరేసింది ఆవిడ.

"ఇందాకా పాట ఆపేశావు. ఇప్పుడు పాడేయమ్మా!" అంది అబ్బాయి పెద్దక్క.

"క్లాసికల్ అస్తమానం విని మొహం మొత్తి వుంటుంది మీకు. ఈసారి ప్రజలందరూ పాడే పాటలు పాడతానండి."

"అలాగే చేయవమ్మా. పదుగురాడు మాట పాడియై ధరచెల్లు - అన్నాడు వేమన. తన కవిత్వం జాతి జనులు పాడే పాట, మార్చింగ్ సాంగ్ కావాలని కలగన్నాడు శ్రీశ్రీ. నీపాట అందరికీ తెలిసి ఉండాలి. విని వెంటనే పాడగలిగి వుండాలి. మహాకవి గురజాడ గురించి రాస్తూ కృష్ణశాస్త్రి -

చుక్కలన్నియు సొక్కిసోలెను
గిరులు కదలెను, తిరుగపాడెను
లోకమోహన మధురగానా
స్వాదమోదమున

-అన్నారు. అలాంటిపాట పాడు చెల్లీ" అని ఉషారిచ్చాడు అన్న చంద్రం.

నీరజ అలాగే అన్నట్లు తల ఆడించి గురజాడవారి "దేశమును ప్రేమించుమన్నా" అనే పాట అందుకుంది. పాడుతూనే ఓరకంట ఎదటివాళ్ళ రియాక్షన్స్ గమనించడం మంచిదైంది. అందరూ ఇబ్బందిగా కుర్చీలో మెలికలు తిరుగుతున్నారు. అంచేత రెండు చరణాలు మర్యాదకి పూర్తిచేసి ఊరుకుంది.

తర్వాత శ్రీశ్రీగారి "శైశవగీతి", దాశరథి గారి "మాట్లాడని మల్లెమొగ్గ" పాటలు పాడింది కానీ అవీ మొగపార్టీవాళ్ళకి నచ్చలేదని గమనించింది నీరజ.

ఓ క్షణం ఆలోచించింది. పంచాంగం సిద్ధాంతిగారు రేడియో, టీ.వి.ల్లో వచ్చే వ్యాపార పాట కూనిరాగం తీయడం గుర్తొచ్చి ఆమెకు నవ్వు పొంగివచ్చింది. "ధైర్యే సాహసే లక్ష్మీ" అని పెద్దలు చెప్పడం గుర్తు తెచ్చుకుంది.

మనస్సులోనే నడుం బిగించి, ఠీవిగా తల పైకెత్తి టీ.వి.లో రోజూ వచ్చే బట్టల సబ్బు పాట ఒకటి మొదలెట్టింది. వాళ్ళకి నచ్చకపోతే మానేయాలనుకుంటూ.

కాని నీరజ ఆ బట్టలసబ్బు పాట మొదలెట్టగానే అదేదో నురగ చేసిన మాయాజాలానికి లొంగిన మురికిలా- మిగతా వాళ్ళందరూ కుర్చీల మీదా, బల్లలమీదా, తమ తొడలమీదా తాళం వేయసాగారు.

అలా కుదిరిపోయింది నీరజ పెళ్ళి.

(కలువబాల; పక్షపత్రిక- 1-2-1989)

★